పజిలు ప్రభావం

"ఫస్టుప్రైజు నాదే చూసుకో" అన్నాడు మోహన్ తల పైకెత్తి చూస్తూ.

దాదాపు రెండు గంటలనుంచీ టేబుల్ దగ్గర తిష్టవేసి క్రాసువర్డు పజిలుతో కుస్తీ పట్టూన్న మోహన్ వరస చూస్తూనే వున్నారు శీనయ్యగారు. పడకకుర్చీలోంచి వచ్చిన ఆ గంభీరమైన చిరునవ్వే దానికి సమాధానం. ఆ నవ్వులో పజిలువేసేవాళ్ల అమాయికత్వంచూసి జాలీ, ప్రైజు ఎల్లాగూ రాదనే విశ్వాసం, ఇట్టి స్వల్పవ్యామోహాలకి అతీతుణ్ణిసుమా అని హెచ్చరించే పెద్దరికమూ, 'ఇటువంటివి చాలా చూసేంతే ఏం క్రొత్తకాదు' అనే భావన ప్రకటించే అనుభవజ్ఞతా, యిమిడి వున్నాయి. ఆ చిరునవ్వు సైలెన్సరున్న రివాల్వరులోని బులెట్టులాగ మోహన్‌ని దూసుకుపోయింది.

"ఆ, మన మోహన్‌కి ఫస్టుప్రైజు కూడానూ" అంటూ సావిట్లో గడపదగ్గర చతికిలబడింది తల్లి లలితాంబగారు. పైకి అలా అన్నా లోలోపల ఆవిడకే ఆ ప్రైజు రావాలనే వున్నట్లు నవ్వుతో కూడిన ఆవిడ వెడల్పు మొహమే చెప్తోంది. లోపలి ఉత్సాహాన్ని అణచుకుందుకు ప్రయత్నిస్తూ, "ఎంతేమిట్రా ప్రైజు?" అన్నది.

"లక్షరూపాయలు" అన్నాడు మోహన్ కళ్లల్లో పడే క్రాపు తల ఆడింపుతో పైకెగరవేస్తూ.

రూపాయిబిళ్లకంటె పెద్దవిగా కళ్ళుపెట్టి అడిగింది చిట్టి "అన్నయ్యా మరి నాకేం కొని పెడ్తావు ప్రైజొస్తే" అని.

"నీకేం కొనను. అంతా నాకే" అన్నాడు మోహన్ కొంటెగా.

"చూశావా అమ్మమ్మా, అన్నయ్య ఏమంటున్నాడో" అంటూ గారాబంగా ఫిర్యాదు చేసింది చిట్టి సావిడి అవతల నడవలో వత్తులు చేసుకుంటూన్న వెంకాయమ్మగారితో.

"ఏమిట్రా అది" అంది ఆవిడగారు.

"నీకు తెలీదమ్మా. ఇవన్నీ ఇంగ్లీషు మాటలు. సరిగ్గా వేస్తే లక్షరూపాయిలొస్తాయి" అని కేకేశాడు మోహన్ చూస్తున్న డిక్షనరీ మూసేసి.

ముసలమ్మగారికేం అర్థం కాలేదుకాని రూపాయిలమాట వినగానే మొహం యింతైంది.

"నేను చెప్పలేదటమ్మా, మోహన్ మంచి ప్రయోజకుడవుతాడనీ. లక్ష్మీకళ వాడి మొహంలో ఉందర్రా"

అని ప్రారంభించింది వెంకాయమ్మగారు.

"అయితే ఎప్పుడు తెలుస్తుందన్నయ్యా ప్రైజు సంగతి?" అని అడిగింది చిట్టి.

"రెండు మూడు వారాల్లో తెలుస్తుందిలే చిట్టీ, నెగ్గిన వాళ్ళకి - అంటే మనకి" - ఛాతీ విరిచి కుడిచేతి బొటనవేలుతో తనవేపు చూపుకుంటూ, "టెలిగ్రాం వస్తుంది. టెలిగ్రాం" అన్నాడు మోహన్.

"మరి టెలిగ్రాంవస్తే కొస్త తమాయించుకుని జాగ్రత్తగా చూడండేం, లేకపోతే ఆ ఆనందంతో గుండె ఆగిపోతుంది" అని హెచ్చరించాడు మోహన్ ఎంతో సీరియస్‌గా మొహం పెట్టి.

"అవునర్రా, ఆమధ్య ఇల్లాగే ఎక్కడో బోలెడంత డబ్బు ప్రైజువస్తే టెలిగ్రాం చూసుకోగానే గుండె ఆగిపోయిందిట ఎవరికోగాని. పేపర్లోకూడా వేశారుట" అన్నారు లలితాంబగారు.

ఇంతలో శంకరం హడావిడిగా వచ్చి మడత మంచంమీద చుట్టబెట్టివున్న పరుపుల మధ్య పడకవేసి "ఆలివరుట్విస్టు" చదవటం మొదలెట్టేడు.

"చిన్నన్నయ్యోయ్ మరి మోహనన్నయ్యేం పజిలు వేస్తున్నాట్ట. మనకి లక్షరూపాయి లొస్తాయిట" అని చెప్పేసింది శంకరంతో చిట్టి ఉండబట్టలేక.

"అప్పుడే వచ్చేసినట్టే సంతోషిస్తోంది పిచ్చిపిల్ల" అంది లలితాంబ ఫలితం ఏమవుతుందో తనకి ఇదివరకే తెలిపినట్లు, మనస్సులో మట్టుకి లక్షరూపాయిల రాశిని ఊహించుకుని మురిసిపోతూ.

"పోస్టుచేసి యిప్పుడే వచ్చేస్తా" నంటూ ఒక్క గంతేసి చక్కా బోయాడు మోహన్. ఇంట్లోని అందరి హృదయాలూ అతనికి సాయం వెళ్ళేయి.

పోస్టాఫీసు ఆ రోజున మోహన్‌కళ్ళ ఇంద్రభవనంలా కన్పించింది. "ఆఫీసు ఎంత బావుందో తను ఇన్నాళ్ళూ చూడనేలేదు" అనుకున్నాడు పోస్టుమాస్టర్ని "ఒక కవరు యివ్వండి సార్" అని బరువుగా, గంభీరంగా అన్న ఆమాటల్లో ఎంతో బ్రహ్మాండమైన పని నెత్తిన పెట్టుకున్న ఎంతో బాధ్యత గల పెద్దమనిషినిసుమా అనే హెచ్చరిక వుంది.

కవరు తీసుకుంటూన్న మోహన్‌కి పోస్టుమాస్టరూ, గుమాస్తాలనీ చూస్తుంటే జాలి వేసింది 'పాపం అంత చిన్న జీతాలతో ఎంత బండచాకిరీ చేస్తున్నారో' అని. కవరు తీసుకుని మిగతా తతంగం పూర్తిచేసి జాగ్రత్తగా కవరు అంటించి, ఊడిపోతుందేమో అని నాలుగుసార్లు దాన్ని గోడకి పెట్టిగుద్ది, అక్కర్లేనప్పటికీ ఎందుకైనా మంచిదని ఇంకో అణాబిళ్ళ ఎక్కువ అంటించి, పోస్టుబాక్సులో చెయ్యి ఎంతవరకూ లోపలకి పోతుందో అంతవరకూ పోనిచ్చి కవరు అందులో వదిలేశాడు మనస్సులో "జై మహంకాళీ" అనుకుంటూ.

"అమ్మయ్యా" అని ఒక్క నిట్టూర్పుతో ఎంతో బరువు తీరినట్లు, ఆఖరిరోజు యూనివర్సిటీ పరీక్షలకి రాసేసి లాడ్జికి వచ్చేసే విద్యార్థిలా ఫీలవుతూ వెళ్ళిపోయాడు మోహన్ అమాయకంగా నించున్న ఆపోస్టుబాక్సులో తనుపడేసిన అమూల్యవజ్రాన్ని తలచుకుంటూ.

"అమ్మా, పోస్టులో వేసేసేనే" అన్నాడు యింటికివచ్చి. అప్పటికే ఇంట్లో వాళ్ళంతా ఆదుర్దాగా చూస్తున్నారు ఇంకా మోహన్ రాలేదేమా అని. లలితాంబగారు శంకరాన్ని ఓసారి వెళ్లి చూసి రమ్మంటున్నారు పోస్టువాళ్ళేమైనా అల్లరి పెడుతున్నారేమో అని. పుస్తకంలో మునిగిపోయిన శంకరం కదలేదు. "ప్రైజొస్తే డబ్బుమూట్లు రావాలి. కొస్త చూసి రమ్మంటె చూడకూడదూ" అంటూంది చిట్టి అప్పుడే ఏడుపు దొరకబెట్టి.

"పెట్టెలో సరిగ్గా వేశావురా నాయనా" అన్నారు లలితాంబగారు.

"ఓ, అంతా అనుకూలంగానే జరిగింది" అన్నాడు మోహన్.

"ఏదో అవుతుంది. మనం చేయాల్సిన పని పూర్తిఅయినట్లే. ఇంక భారం దేవుడిది"

అన్నారు లలితాంబగారు చిట్టి తల దువ్వుతూ.

"ఈ పాటికి మనకవరు రైల్లోవుంటుంది" అన్నాడు మోహన్ కవరు గమ్యస్థానాన్ని చేరేవరకూ చేసే ప్రయాణాన్ని ఊహించుకుంటూ.

"అన్నయ్యా, మరి ఆ లక్ష రూపాయిలొస్తాయిగదా ఏం చేస్తావురా" అంది చిట్టి ఊలుముక్క తల్లికి అందిస్తూ.

"నేను పారిస్, లండన్, న్యూయార్కు — అన్నీ చూసేస్తాను. స్టీమరూ, విమానం ఎక్కి ప్రపంచం అంతా తిరిగేస్తాను. బ్రహ్మాండమైన సూట్లు వేస్తాను. ఇంకా ఫారెక్‌లో పెద్ద పెద్ద దొరల హోటళ్ళలో మకాం వేస్తాను సినిమాలూ, డాన్సులూ, హాలీవుడ్డూ ఓ, ఒకటేమిటి మన జీవితం యింక మీదట అంతా హైక్లాసులో నడిచిపోతూంది" అంటూ ఇంక మాట్లాడలేక పోయాడు మోహన్ రాకెట్టుకంటె స్పీడుగా తన మెదడులో పరుగెత్తే ఆలోచనల్లో ఆశల్లో ఉక్కిరిబిక్కిరియై.

"శుభ్రంగా ఓ యిల్లు కొనుక్కుందాం" అని సలహాయిచ్చేరు లలితాంబగారు. ఇంటి ముందు అరుగుమీదీ తడి కక్కేసీ, పెరట్లో పడిపోయే దడికేసీ చూసి చీదరించుకుంటూ, మళ్ళీ "ప్రైజెల్లాగూ వస్తుంది. యింక ఈ ఇంటితో ఋణం సరి" అని మనస్సులో సమాధానము చెప్పుకుంటూ.

"కొనుక్కోడం ఏం ఖర్మమమ్మా. హాయిగా మీ యిష్టంవచ్చిన ఫాషనులో కట్టుకోక" అన్నాడు దర్జా పద్దుగా, అప్పుడే వచ్చి కూలబడింటూన్న శంభన్న. (శంభన్న గారంటే మోహన్‌వాళ్ళ ఫామిలీ మనిషిలెండి. రోజూ వాళ్ళింటికి కనీసం ఓ మారేనా వచ్చి, కబుర్లు చెప్పి, శీనయ్య గారి తంబాకు సేవించి, చక్కాపోతాడు)

"నేనైతే ప్రపంచంలోని పెద్దపెద్ద రచయితల పుస్తకాలన్నీ కొనేసి చదివేస్తాను. లండన్‌వెళ్ళి షేక్స్‌పియర్ వుండేనయిల్లూ, లండన్ టవరూ, అమెరికాలో వాషింగ్టన్ స్క్వేరూ, పారిస్‌లో రివల్యూషను జరిగిన వీధులూ — నేను పుస్తకాల్లో చదివిన చోట్లన్నీ చూసేస్తాను" అన్నాడు శంకరం మంచంమీంచి

"కాస్త నా మొహాన్ని కూడా పడేయండ్రా, కాశీ రామేశ్వరాలు సేవించుకు వస్తాను." అంది వెంకాయమ్మ

"నేను ఎంచక్కా రిబ్బన్లూ, గౌన్లూ కొనుక్కుంటానుగా" అంది చిట్టి చంక లెగరేస్తూ, 'చొక్కా తొడుక్కోవే' అనే తల్లిమాట వినకుండా, మడివిడి జారిపోయే లాగూకేసేనా చూడకుండా.

"ఏరా మోహన్, ఏమిటి కథ? ఇంట్లో అంతా మంచి హుషారుగా వున్నారే?" అన్నాడు అప్పుడే వచ్చిన మోహన్ క్లాసుమెట్ విశ్వం.

"పజిలు వేశానురా, వచ్చే ప్రైజుతో ఏం చెయ్యాటమా అని ఆలోచిస్తున్నాం" అన్నాడు మోహన్

"కష్టపడి పనిచేసి పొట్టనింపుకోవాలి గాని ఈ వెర్రి ఆశలూ, ఊహాలూ ఎందుకురా భాయి డబ్బుకోసం ఇలా గంగవెఱ్ఱులెత్తి పోతున్నారే" అన్నాడు విశ్వం

"ఒరేయి నువ్వు వొట్టి కమ్యూనిస్టువురా, నీకు తెలీదు వూరుకో" అన్నాడు మోహన్ ఇంగ్లాండు అమెరికాలలో తను చూడబోయే ప్రదేశాల్ని ఊహించుకుంటూ.

"ఏదో ఈ పదివేల అప్పు తీరితే అదే చాలు అంతకంటే ఆశలులేవు" అన్నారు ఆఖరికి శీనయ్యగారు కూడా చిరునవ్వులేని బాధ్యతాయుతమైన మొహంతో.

"ఇంతకీ వాళ్ళదగ్గర అంతడబ్బు వుండొద్దూ యివ్వటానికి" అని సందేహించారు లలితాంబగారు.

"ఏమండోయి, లలితాంబగారూ, మీకా భయమక్కర్లేదు. ఇల్లా పజిలు పెట్టేవాళ్లు

"వచ్చేప్రైజుతో ఏం చెయ్యాటమా అని ఆలోచిస్తున్నాం'
"కష్టపడి పనిచేసి పొట్టనింపుకోవాలి గాని వెర్రి ఆశలూ, ఊహాలూ ఎందుకురా భాయి......"

★ పజిలు ప్రభావం ★

అతులకొద్దీ వుంటారు" అని ధైర్యం చెప్పేడు విశ్వం.

....

పజిలు తెలిసే రోజు దగ్గిరైనకొద్దీ ఇంట్లో వాళ్ళంతా ఆదుర్దాపడటం మొదలెట్టేరు. టెలిగ్రాం ప్యూన్‌కోసం ఎదురు చూస్తున్నారు. ఆఖరికి ఆ ప్యూన్ పెళ్ళాం కూడా వాడికోసం అల్లా ఎదురుచూచి యుండదు. ఆఖరికి రోజూవచ్చే పోస్టుమాన్ కేసి అనుమానంగా చూసేవారు ఇంకా ఏ ఉత్తరమేనా ఇవ్వలేదేమో అని.

ఓ రోజున టెలిగ్రాంమునిషి రానే వచ్చాడు. ఇంట్లో అంతా ఒక్కసారి అంగ లార్చుకుని వీధిగుమ్మం కాసేరు. వాడు ఎదురింట్లో ఇచ్చేసి వెళ్ళిపోయాడు. లలితాంబగారికి ఆవేళ వాడిమీద వచ్చిన ఆగ్రహం చెప్పటానికి వీల్లేనిది. ఒక్కొక్కప్పుడు పోస్టువాడు ఇంటిముందు ఆగకుండా సైకిలుమీద వెళ్ళిపోతూంటే వాడిమీద విరుచుకుపడేది లలితాంబ తన మనస్సులో తప్పంతా వాడిదే అయినట్లు.

"అమ్మా పోస్టువచ్చిందే" అన్నాడు మోహన్ ఓ రోజున. ఒక్క గంతేసింది వీధిగుమ్మం కేసి లలితాంబ. వెంకాయమ్మ పెరట్లో తులసికోట దగ్గిరనుంచి వీధిగుమ్మం కేసి ఆత్రంగా చూసింది తను చేసే పూజ మానేసి. శివయ్యగారుకూడా పడక్కుర్చీలో కేర్లబడ్డ పోజులోంచి ముందుకు వంగేరు. ఇంతా చేస్తే అది పెళ్ళి శుభలేఖ. అందరూ తెల్ల మొహాలు వేశారు.

"ఎప్పుడూ వీళ్ళకి పెళ్ళిళ్ళే. ఇంకేం పనిలేదు" అని శుభలేఖ పంపించినవారిని విసుక్కున్నారు లలితాంబగారు.

ఆఖరికి పోస్టుమానుకే మొహమాటం వేసేది "వీళ్ళకేం ఉత్తరం ఇయ్యలేకపోతున్నాను కదా" యని.

"నా తప్పేం లేదమ్మా, ఎవరూ మీకు రాయటం లేదు. నేనేం చెయ్యను" అనే ధోరణిలో మొహంపెట్టి సిగ్గుగా సైకిలు తొక్కుకు పోయేవాడు.

మోహన్ తరచు పోస్టుఆఫీసుకీ టెలిగ్రాఫ్ ఆఫీసుకీ వెళ్ళి అడిగేవాడు "మాకేమేనా వచ్చిందా" అంటూ. ఒక్కొక్కప్పుడు మోహన్‌కి రాత్రి నిద్రపట్టేది కాదు. కలలో పజిలుమాటలుదొర్లిపోయేవి.

అప్పులవాళ్ళని "ఇంకోవారం ఓపిక పట్టండి. అంతా అణాపైసలతో తీర్చేస్తాను" అని పంపించేవారు శివయ్యగారు తమ దృష్టిలో అదేమంత పెద్ద బాకీ కానట్లు.

లలితాంబగారు రోజూ గట్టిగా లక్ష్మీస్తవం స్తోత్రంచేస్తూ పూజలుచేసేవారు.

చిట్టి వీధిలో రిబ్బన్లవాడికేసి చూసి నవ్వుకునేది. "ఇంకెన్నాళ్ళు తిరుగుతావు లేవోయ్, ఇంకోవారంలో అన్నీ నేనే కొనేస్తాను" అన్న ధోరణిలో.

శివయ్యగారు ఓ రాత్రివేళ ఉలిక్కిపడే వారు. అర్జంటు టెలిగ్రాం ఏమేనా వచ్చిందేమో అని.

....

అనుకున్న రోజు వచ్చింది. నెమ్మదిగా నీరసంగా పేపరు చేత్తో పుచ్చుకొని మోహన్ వచ్చాడు. సావిట్లో గడపదగ్గర కూర్చున్న లలితాంబగారూ, పడక కుర్చీలోని శివయ్యగారూ, వడవలో ఫలహారం తింటూన్న వెంకాయమ్మగారూ, మడత మంచంమీద శంకరం, మూడు చక్రాల సైకిలుపైని చిట్టీ - అందరి మొహాలు విప్పిం చన్నట్లు ప్రశ్నించేయి ఆత్రంగా బాధగా, ఆశతో.

"మూడు తప్పులొచ్చాయి నాన్నా. అయినా వాడి సొల్యూషనుకి అర్థంలేదు." అంటూ కుర్చీలో కూలబడ్డాడు మోహన్.

"నేను చెప్పలేదూ మన మొహాలకి ఆ మాత్రం అదృష్టం కూడానా" అని సాగదీస్తూ వంటింట్లోకి వెళ్ళిపోయారు. లలితాంబగారు.

టీపార్టీ అడుగుదామని వచ్చిన విశ్వం, ఇల్లుకట్టుకుందుకు స్థలం అమ్మకానికి వుందని చెప్పడానికివచ్చిన శంభన్నా ఇంట్లో వాళ్ళమొహాలు చూసి మాట్లాడకుండా వెళ్ళిపోయారు.

వీధిలోంచివెళ్ళే పోస్టువాడికి ఆశ్చర్యం వేసింది తన్నిల్లా ఎందుకు వదిలేశారా అని. ★

కేరళ సోప్

GOVERNMENT OF MADRAS
మద్రాసు సర్కారు ఉత్పత్తి

స్నానపు సోపులు

చందనపు సోప్ || రోజ్ సోప్

మెడికల్ సోపులు

కోల్‌తార్ సోప్ || వెప్ సోప్

కుటుంబపు సోపులు

వాష్ వెల్ సోప్ (బార్లు & కేకులు) || దీపా బాయిండు సోప్ పాత్ర సామానులకు

కేరళ సోప్ ఇన్‌స్టిట్యూట్, కోజికోడ్

మద్రాసు ప్రభుత్వపు ఇండస్ట్రీస్ & కామర్సు, డిపార్టుమెంటు యొక్క ఒక డివిజన్.

Sis-Ksta' S.-54.